**కథ**

**కొల్లూరి సోమశంకర్**

**భోగాపురం! విజయనగరం జిల్లాలో మేజర్ పంచాయితి. ఆ ఊర్లో దాదాపు ఇరవై వేలమంది జనాభా ఉంటారు. ఐదవ నెంబరు జాతీయ రహదారిపైన, విజయనగరానికి సుమారు 19 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇక్కడ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ వారి శాఖా గ్రంథాలయం ఉంది. మన కథానాయకుడు మోహన్ ఇక్కడే లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నాడు.**

# నిశ్శబ్దానికి మరోవైపు

ఉదయం ఎనిమిది గంటలు దాటుతోంది. అయినా లైబ్రరీని ఇంకా తెరవలేదు. మోహన్ విజయనగరం నుంచి రావాలి. దినపత్రికల కోసం వచ్చే ముసలివాళ్ళు అసహనంగా ఉన్నారు. ఇంతలో హడావుడి పడుతూ మోహన్ రానే వచ్చాడు. గబగబా తాళాలు తీసి, కిటికీ లోంచి లోపలికి పడేసిన పేపర్లను సర్దుకుని, ప్రతీ పేపరుని దారంతో కట్టి, వాటి మీద ముద్ర వేసి బల్లలపైన పెట్టాడు.

క్రిందటి రోజు పేపర్లన్నింటిని బల్లల పై నుంచి తీసేసి, ఒక్కోదాన్ని స్టాండులో వరుసగా పెట్టాడు. వచ్చిన పాఠకులందరూ కుర్చీలకు అతుక్కుని వార్తాపత్రికలు చదవడంలో నిమగ్నమైపోయారు. మోహన్ కాస్త ఊపిరి పీల్చుకున్నాడు. సమయం తొమ్మిది కావస్తోంది. 'టీ' తెచ్చే కుర్రాడు ఇంకా రాలేదు. ఆ సమయానికి టీ తాగకపోతే ఏందోలా ఉంటుంది మోహన్‌కి.

ఇంతలో ఓ కుర్రాడు వచ్చి, "సార్ యండమూరి నవలలు ఏవైనా ఉన్నాయా?" అని అడిగాడు.

"అక్కడ 'తెలుగు నవలలు' అనే అరలో చూడు బాబూ" అంటూ ఓ అరని చూపాడు మోహన్. ఆ అబ్బాయి కాసేపు వెదికి, తిరిగి మోహన్ దగ్గరికే వచ్చాడు.

"సార్, అవన్నీ బాగా పాతవి. ఈమధ్య వచ్చిన పుస్తకాలు లేవా?" అని అడిగాడు. బదులుగా ఒక చోట కట్టలు కట్టి ఉన్న పుస్తకాలను చూపించాడు మోహన్.

"వాటిని బైండింగ్ చేయించాలి. యండమూరి నవలలు వాటిల్లో కొన్ని ఉన్నాయి. నీకు కావాల్సిన పుస్తకాన్ని తీసుకు వెళ్ళి, చదివి, తర్వాత బైండింగ్ చేయించి ఇస్తానంటే, పట్టుకెళ్ళు" చెప్పాడు మోహన్.

"అదేంటి సార్, నేనెందుకు బైండింగ్ చేయించాలి?" అని అడిగాడా కుర్రాడు.

"ఏం చేయను? ఈసారి బడ్జెట్‌లో బైండింగ్‌కి ప్రొవిజన్ ఇవ్వలేదు. సహృదయులైన పాఠకులనే భరించమంటున్నారు. మీరు మెచ్చిన, మీకు నచ్చిన పుస్తకాన్ని మీరు బైండింగ్ చేయిస్తే, మరికొంతమంది పాఠకులకు ఆ పుస్తకం చదివే వీలుంటుంది కదా" వివరంగా చెప్పాడు మోహన్.

ఆ అబ్బాయి మారుమాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఇంతలో టీ కుర్రాడు వచ్చి వేడి వేడిగా టీ ఇచ్చాడు. టీ తాగి తన పనిలో లీనమైపోయాడు మోహన్. ఆ రెండు గదుల్లోను నిశ్శబ్దం రాజ్యమేలసాగింది. సమయం పదకొండు గంటలు కావచ్చింది. ఆ పూటకి లైబ్రరీ కట్టేసే సమయం అయిందంటూ మోహన్ అలారం మోగించాడు. పాఠకులందరూ చదువుతున్న పేపర్లు, పుస్తకాలు, నవలలు, బల్లపైన పెట్టేసి ఒక్కొక్కరు బయటకు రాసాగారు.

ఒక పెద్దాయన మాత్రం మోహన్ గదిలోకి వెళ్ళారు. ఆయన మోహన్‌కి దూరపు బంధువు. పేరు సీతారామయ్య. భోగాపురంలోనే హెడ్‌మాస్టారుగా పని చేసి రిటైర్ అయ్యారు.

"ఏం మోహనా, ఇక్కడ ఒక్కడివి కూర్చుని ఏం చేస్తావు? మా ఇంటికి వచ్చేయ్! కాసేపు చదరంగం ఆడుకుందాం. సాయంత్రం నాలుగు గంటలకి తిరిగి రావచ్చు" అని అన్నారు.

"వీలుకాదు బాబాయ్. చాలా పనులు ఉన్నాయి" చెప్పాడు మోహన్.

"అదేం, అందరూ వెళ్ళిపోయాక నీకు పనులేం ఉంటాయి?" అడిగారాయన.

"అసలు పనులు అప్పుడే మొదలవుతాయి బాబయి. స్టాక్ రిజిస్టరుని, అక్సెషన్ రిజిస్టరుని, కాష్‌బుక్‌ని అప్‌డేట్ చేయాలి. క్లాసిఫికేషన్, కాటలాగింగ్ చేసుకోవాలి. చదివేసి వదిలేసిన పుస్తకాలను తిరిగి అలమార్లల్లో పెట్టాలి. ఇలాంటివి ఎన్నో పనులు ఉంటాయి బాబాయ్. నాకు రావడం కుదరదు" అని చెప్పాడు మోహన్.

"సరే, నీ ఇష్టం" అంటూ వెళ్ళిపోయారు సీతారామయ్యగారు.

ఆ లైబ్రరీకి మోహన్ ఒక్కడే ఉద్యోగి కావడంతో, అతడికి చాలా కష్టంగా ఉంటోంది. చిన్నదైనా, పెద్దదైనా ప్రతీ పనీ అతడే చేసుకోవాల్సి వస్తోంది. ఒక సహాయకుడిని నియమించమంటే, నిధులు లేవంటూ ఏడాది నుంచి తిరస్కరిస్తున్నారు పై అధికారులు. చేసేదేమీ లేక, ఒక నెలక్రితం, ఆ ఊర్లోనే పదో తరగతి దాకా చదువుకుని, చదువాపేసిన ఓ కుర్రాడిని సొంత పూచీకత్తుపైన, తనకు అసిస్టెంట్‌గా పెట్టుకున్నాడు మోహన్. ఆ కుర్రాడు శ్రద్ధగా పనిచేస్తుండడంతో, దినపత్రికల గది తాళం అతనికే ఇచ్చి, లైబ్రరీని పొద్దున్నే ఆ కుర్రాడిని తెరవమనేవాడు. మోహన్ మాత్రం 9 గంటలకి వచ్చి, నవలల సెక్షన్ తెరుస్తున్నాడు. గత మూడు రోజులుగా ఆ కుర్రాడు ఊరు వెళ్ళడంతో, మోహన్‌కి పనిభారం ఎక్కువైంది.

దానికితోడు నిన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేలంపాట జరిగింది. ఏడాదికి ఒకసారి పాత దిన, వార, పక్ష, మాసపత్రికలను అన్నింటిని కలిపి వేలం వేస్తారు. ఎవరు ఎక్కువ పాడితే, వారికి జిల్లాలోని అన్ని గ్రంథాలయాల నుంచి పాత పుస్తకాలు, పేపర్లని ఇచ్చేస్తారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏ శాఖా గ్రంథాలయంలో ఏ పుస్తకం ఉంటుంది, ఏయే దినపత్రికలు ఉంటాయి, వాటి బరువు తదితర వివరాలు ఉంటాయి. ఆ వివరాలన్నీ వేలంపాటలో గెల్చినవారికి అందచేసి 'ఫలానా గ్రంథాలయం నుంచి, మీకు ఇన్ని కిలోల పాత పత్రికలు వస్తాయి. మీరు ఇంత మొత్తం ఇవ్వాలి' అనే ఒప్పందం కుదుర్చుకుంటారు. ఏదైనా శాఖా గ్రంథాలయాలలో చెప్పిన దానికంటే తక్కువ మొత్తం వసూలైతే, మిగతా మొత్తాన్ని లైబ్రేరియన్ భరించాల్సిందే. ముందే నిర్ణయమైన మొత్తాన్ని ట్రెజరీలో జమ చేయాల్సిందే.

చాలా శాఖాగ్రంథాలయాలలో భవనాలు సరిగా ఉండవు. వర్షాలకు, చెదలకు పుస్తకాలు పాడయిపోతుంటాయి. కొంతమంది చదువరులు తమకు కావాల్సిన ప్రకటనల కోసం కొన్ని పేజీలు ఎత్తుకుపోతారు. మరికొంతమంది కథలను కత్తిరించి తీసుకుపోతారు. మరికొంతమంది సినిమా స్టార్ల బొమ్మలు కత్తిరించేస్తారు. ఈ విధంగా దాదాపుగా ప్రతీ లైబ్రరీలోను పుస్తకాల, పేపర్ల బరువు ఎంతో కొంత తగ్గుతుంది. దాంతో లైబ్రేరియన్లు తమ జేబులు ఖాళీ చేసుకోక తప్పదు.

మోహన్‌కి కొంచెం ఆందోళనగా వుంది. ఎందుకంటే గత రెండేళ్ళుగా అతను తన డబ్బును కడుతూనే ఉన్నాడు. "ఈ ఏడాది ఏమవుతుందో? రేపు పార్టీ వస్తుంది" అని అనుకుంటూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

సాయంత్రం నాలుగయ్యింది. మళ్ళీ చదువరులు రావడం ప్రారంభించారు.

ఓ కుర్రాడు వచ్చి, మోహన్‌కి ఎదురు కుర్చీలో కూర్చుని "పట్నంలో చిలక నవల వచ్చిందా?" అని అడిగాడు.

"కల్పనా సాహిత్యం, ఉద్రేకం కలిగించేవి జిల్లా కేంద్ర గ్రంథాలయం కొనడం లేదు" చెప్పాడు మోహన్.

"ఓ సుప్రసిద్ధ వారపత్రికలో సీరియల్‌గా వచ్చి, ఎంతోమంది పాఠకులను ఉర్రూత లూగించిన నవల అది. అలాంటి పుస్తకాలు లేకపోతే ఎలాగ?" అన్నాడు ఆ కుర్రాడు.


"చూడు బాబు, 1993 నుంచి లైబ్రరీ లలో నవలలు తెప్పించడం మానేసారు. కాంపిటేటివ్ పుస్తకాలు, ఇయర్ బుక్స్, రిఫ రెన్స్‌బుక్స్, కథా సంకలనాలు వంటివే తెప్పి స్తున్నారు. వాటిల్లో నీకు కావాల్సినవి ఏవైనా ఉంటే తీసుకుని చదువుకో" చెప్పాడు మోహన్.

"అదేంటండి, మేము ఇంటి పన్ను కడు తున్నాం. అందులో లైబ్రరీ సెస్ కూడా ఉంటుంది. మా డబ్బులు తీసుకుంటూ మేము అడిగిన పుస్తకాలు తేవడం ఏం మర్యాద?" అంటూ ఆ కుర్రాడు గదమా యించాడు.

ఆ అబ్బాయికి నచ్చచెప్పి పంపేసరికి, తల ప్రాణం తోకకి వచ్చింది మోహన్‌కి.

అప్పుడప్పుడు ఇలా దురుసుగా ప్రవ ర్తించే పాఠకులు తటస్థపడుతుంటారు. వాళ్ళతో సంయమనంగా వ్యవహరించక పోతే, గ్రామ సర్పంచ్‌కి, జిల్లా కేంద్ర గ్రంథా లయాధికారికి ఫిర్యాదు చేస్తూంటారు.

ఆరు యాభై దాక ఓపికగా కూర్చున్న మోహన్‌ను నిస్రాణత ఆవరించింది. 'టైం' అవుతోందంటూ అలారం మోగిందాడు. మెల్లిగా ఒక్కొక్కరు వెళ్ళాక, పేపర్లని సర్దు కొని, గదులు తాళం వేసి, బయటి తాళం వేసుకుని ఇంటిముఖం పట్టాడు. కాస్త ఖాళీగా ఉన్న బస్సు పట్టుకుని ఇల్లు చేరేస రికి ఎనిమిది గంటలైంది.




మోహన్ భార్య శ్రావణి సంగీతం టీచరు. వాళ్ళకి ఇద్దరు పిల్లలు. కూతురు సరోజ ఐదో తరగతి, కొడుకు శ్రీరామ్ మూడో తరగతి చదువుతున్నారు. మోహన్ తల్లిదండ్రులు శ్రీకాకుళంలో వాళ్ళ పెద్దబ్బాయి దగ్గర ఉంటారు. భర్త ఇంటికి చేరేసరికి కమ్మటి కాఫీ కలిపి సిద్ధంగా ఉంచు తుంది శ్రావణి. కాఫీ తాగుతూ పిల్లల కబుర్లు వింటాడు మోహన్. వాళ్ళతో కబుర్లు చెప్పుకోడం కోసం, పిల్లలు తమ హోం వర్కుని గబగబా పూర్తి చేసుకుని, చదవాల్సిన పాఠాలు చదివేసుకుని, భోంచేసి తయారుగా ఉంటారు. 9.00-9.30 మధ్యలో స్నానానికి లేస్తాడు మోహన్. పిల్లలని నిద్రపుచ్చి, అన్నం వడ్డిస్తుంది శ్రీమతి. ఇద్దరూ భోజనాలు చేశాక, కాసేపు అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజు కృతులు పాడుతుంది శ్రావణి. ఆ రోజు శ్రమని మరుస్తూ, నిద్రలోకి జారుకుంటారు ఇద్దరూ. ఆర్థికంగా వెలితి ఉన్నా, కలత లేని సంసారం వాళ్ళది.

* * *

తెల్లారింది. ఆ రోజు గురువారం. మరుసటి రెండు రోజులు శుక్రవారం, రెండో శనివారం కావడంతో లైబ్రరీ కాస్త హడావుడిగా ఉంటుంది. 'ఈ ఒక్కరోజూ వెళితే, రెండు రోజులు సెలవు' అని అనుకుంటూ గబగబా తయారయ్యాడు మోహన్.

గ్రంథాలయానికి చేరేసరికి, ఇద్దరు ముగ్గురు అతడి కోసమే ఎదురు చూస్తున్నారు. తాళాలు తీసి గదుల కిటి కీలు పూర్తిగా తెరచి, పేపర్లపై ముద్రలు వేసి బల్లలపై పెట్టాడు మోహన్.

కాసేపయ్యాక ఓ అమ్మాయి వచ్చి, "సార్ మీతో కాస్త మాట్లాడాలి. మీరు ఎప్పుడు ఖాళీగా ఉంటారో చెబితే అప్పుడు వచ్చి కలుస్తాను" అంది నమ్రతగా.

"నేనిప్పుడు ఫ్రీగానే ఉన్నాను. చెప్పండి, దేని గురించి మాట్లాడాలి?" అన్నాడు మోహన్.

"నేను డి.ఎస్సీ పరీక్షలకి ప్రిపేరవుతున్నాను సార్! నాకు కొన్ని రిఫరెన్స్ బుక్స్ కావాలి. అవి విజయనగరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో దొరుకుతాయి. ఈసారి మీరు విజ యనగరం నుంచి వచ్చేటప్పుడు వాటిని మీ ఎకౌంట్‌లో తీసుకుని వాకిస్తే, నాకు చాలా సహాయం చేసినవారవు తారు. నేను అంత ఖరీదు పెట్టి వాటిని కొనలేను" చెప్పిందా అమ్మాయి.

"మీ పేరేమిటి? ఇల్లెక్కడ?" అని అడిగారు మోహన్.

"నా పేరు కావ్య. మాది సర్పంచ్‌గారి ఎదురిల్లు" చెప్పిందా అమ్మాయి.

"చూడమ్మా, ఈమధ్య జిల్లా కేంద్ర గ్రంథాలయం వాళ్ళు పాఠకులకి ఓ ప్రతిపాదన చేసారు. మీకు కావాల్సిన పుస్తకాల పేర్లు మాకు రాసిస్తే, వాటిల్లో ఉత్తమమైన వాటిని కొని, అన్ని శాఖాగ్రంథాలయాలకి పంపుతారు. పోటీ పరీక్షలకి హాజరయ్యే మీలాంటి వాళ్ళకి కావాల్సిన పుస్తకాలను నువ్వు రాసిస్తే, నేను మన గ్రంథాలయం తరఫున విజయనగరం పంపిస్తాను" అన్నాడు మోహన్.

"తప్పకుండా రాసిస్తాను సార్" అంటూ సంతోషంగా వెళ్ళింది కావ్య. ఇలాంటివాళ్ళని చూస్తే మోహన్‌కి ముచ్చటేస్తుంది. ఎదగాలనే తపన ఉన్నవారిని ప్రోత్సహించాలనే మనస్తత్వం మోహన్‌ది. ఓ అయిదు నిముషాల తర్వాత కావ్య వచ్చి రెండు కాగితాలు ఇచ్చింది. ఒకటి గ్రంథాలయంలో ఉండాల్సిన పుస్తకాల పట్టీ, రెండోది ఆమెకి కావాల్సిన పుస్తకాలు.

"ఈ పుస్తకాలని సోమవారం తెస్తానమ్మా" అన్నాడు మోహన్.

"థాంక్యూ సార్, మీకు నా కృతజ్ఞతలు" అంది కావ్య. తరువాత మోహన్ తన పనులలో మునిగిపోయాడు.

మధ్యాహ్నం మూడు గంటలకి పోస్టు వచ్చింది. అనుకున్నట్టుగానే జిల్లా కేంద్ర గ్రంథాలయం నుంచి రెండు ఉత్తరాలు వచ్చాయి. ఒక ఉత్తరంలో తన లైబ్రరీలో పాత పుస్తకాలు, పేపర్ల బరువు, వాటిని అమ్మితే వచ్చే డబ్బు ఎంతో, రాసి పంపారు. వేలం పాటలో నెగ్గినవాడు సోమవారం నాడు వచ్చి పాత పత్రికలు, పేపర్లు తీసుకు వెడతారని రాసారు.

రెండో ఉత్తరంలో భోగాపురం బ్రాంచి లైబ్రరీలో కొత్త చందాదార్లు ఎవరూ ఉండడం లేదని, అందువల్ల ఓ ఇంక్రిమెంట్ కట్ చేస్తున్నట్లు, ఇంకా కొంతకాలం ఇలాగే జరిగితే గ్రేడ్ తగ్గిస్తామని రాసారు.

## వన్స్ మోర్

భూమిక ఇపుడు డేరింగ్ ఉమెన్ అన్పించుకుంటోంది. సల్మాన్‌ఖాన్‌తో కలిసి నటించడానికి తారలంతా వెనుకాడుతున్నా 'తేరేనామ్' చిత్రంతో సల్మాన్‌తో కలిసి నటించిన భూమిక ఇప్పుడు మళ్లీ అదే టీంతో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. 'దిల్‌నే జిసే అప్నా కహా' చిత్రంలో ఆమె సల్మాన్‌తో కలిసి నటిస్తోంది. ఇదిలా ఉంటే ఆమె తెలుగు చిత్రం 'నా ఆటోగ్రాఫ్...' యావరేజ్ టాక్ రావడం ఆమెని కొంచెం నిరాశ పరిచిందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి.

సాయంత్రం ఆరు గంటలకి సీతారామయ్యగారు వచ్చారు. కరెంట్ పోవడంతో, చదువరులు ఒక్కొక్కరు, మెల్లగా ఇళ్ళకి వెళ్ళిపోసాగారు. మోహన్ రెండు కుర్చీలు తెచ్చి బయట వరండాలో వేసాడు.

"రా బాబాయ్, బయట కూర్చుందాం" అంటూ సీతారామయ్యగారిని పిలిచాడు మోహన్.

"విశేషాలు ఏమున్నాయి అబ్బాయ్?" అంటూ కూర్చున్నారు సీతారామయ్యగారు.

"సోమవారం మన లైబ్రరీలోని పాత పుస్తకాలు, పేపర్లు అమ్మేస్తున్నాం బాబాయ్. నువ్వు సర్పంచ్‌గారు వచ్చి సాక్షి సంతకాలు చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది కూడా ఉండాల్సిన బరువు కంటే తక్కువే తూగుతాయి" అన్నాడు మోహన్ గట్టిగా నిట్టూరుస్తూ.

"పోన్లేరా బాధపడకు! ఈసారి నుంచి పత్రికలను ఎవరూ చించకుండా జాగ్రత్త వహించేలా, నువ్వు పెట్టుకున్న కుర్రాడికి తర్ఫీదునివ్వు" అన్నాడు సీతారామయ్య.



"ఇదే కాదు బాబాయ్, కొత్తగా చందాదారులు ఎవరూ చేరడం లేదని నాకో ఇంక్రిమెంట్ కట్ చేసారు" చెప్పాడు మోహన్ బాధగా. "ఇవ్వాల్సిన జీతం బకాయిలు చెల్లించకుండా, పైగా ఇదొకటా! మా కాలంలో గ్రంథాలయాలను ఎంతగానో ఉపయోగించుకునే వాళ్ళం! ఇప్పుడు 'రీడర్‌షిప్' బాగా తగ్గినట్టుంది. ఎందుకంటావ్?" అన్నారు సీతారామయ్యగారు.

"పుస్తకాలు కొనడానికి గ్రాంట్లు ఇవ్వడం తగ్గించేసింది ప్రభుత్వం. దాంతో గ్రంథాలయాలలో కొత్త పుస్తకాలు కొనడం లేదు. పైగా ద్రవ్యోల్బణం, ప్రైవేటీకరణ, ఆర్థిక సంస్కరణలు ప్రజల జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పుస్తకాలు కొని చదవడం ఎలాగూ కష్టం, కనీసం లైబ్రరీలోనైనా చదువుకుందాం అని లైబ్రరీకి వచ్చేవాళ్ళు, కొత్తపుస్తకాలు లేకపోయేసరికి నిరాశ చెందుతున్నారు. దీనికి తోడు కేబుల్ టీవీ ప్రజల తీరిక సమయాన్ని తన వశం చేసుకుని పాఠకులలో పఠనాసక్తిని తగ్గించేసింది" అని వివరించాడు మోహన్.

"నువ్వు చెప్పింది నిజమే. మా స్కూల్ మాస్టార్లతో మాట్లాడతాను. వాళ్ళు ఎవరైనా కొత్త చందాదారుల్ని పంపుతారేమో చూద్దాం" అంటూ, "చీకటిపడుతోంది. నేనిక బయల్దేరనా?" అని అడిగారు సీతారామయ్యగారు.

"సరే, బాబాయ్, సోమవారం కలుద్దాం" అన్నాడు మోహన్.

"ఏం ఆదివారం రావా?" అడిగారు సీతారామయ్య.

"రాను బాబాయ్. ఆదివారం హెడ్డాఫీసులో పనులు ఉన్నాయి. అందుకని బయట తలుపుమీద నోటీస్ అంటించి వెళ్ళిపోతాను" చెప్పాడు మోహన్.

"సరే ఉంటాను" అంటూ వెళ్ళిపోయారు సీతారామయ్యగారు.

ఆరూ యాభై ఐదు అవుతోంది. కరెంట్ ఇంకా రాకపోవడంతో, పుస్తకాలన్నీ సర్ది, తలుపు మీద నోటీస్ అంటించి, తనూ బయల్దేరాడు మోహన్.

* * *

శుక్రవారం శ్రావణికి ఎంతో ఇష్టమైన రోజు. పిల్లలను బడికి పంపాక, మార్కెట్‌కి వెళ్ళి కూరలు తెచ్చుకుంటారు శ్రావణి, మోహన్. ఆ తర్వాత ఆ రోజంతా కబుర్లతోనే గడిచిపోతుంది. ఏవైనా బిల్లులు కట్టడం..లాంటి పనుల్ని శుక్రవారం పెట్టుకుంటాడు మోహన్. లైబ్రరీలో అలవాటైన నిశ్శబ్దం, ఏ పుస్తకం ఎక్కడ ఉండాలో అక్కడ పెట్టడం లాంటి పద్ధతులు ఇంట్లో కూడా పాటిస్తాడు. ఒక్క శుక్రవారం మాత్రం వీటన్నింటికీ మినహాయింపు. సాయంత్రం బడి నుంచి ఇంటికొచ్చేసరికి నాన్న ఇంట్లో ఉంటే పిల్లలకి ఎంతో హుషారు. శుక్రవారాలు సాయంత్రం పూట పార్కుకి తీసుకు వెళ్ళి, ఆటలు ఆడిస్తుంటాడు మోహన్. ఈసారి రెండో శనివారం కూడా కలిసి వచ్చింది. శనివారం నాడు పిల్లలతో కలిసి కైలాసగిరి వెళ్ళారు శ్రావణి, మోహన్. కొండ మీద నుంచి చూస్తుంటే, విశాలమైన సముద్రం కనువిందు చేసింది.

ఆ తర్వాత జూపార్క్‌కి వెళ్ళారు. పిల్లల ఆనందానికి అంతే లేదు. రాత్రి అందరూ కలసి భోంచేస్తుంటే. "ప్రతీ రోజు రెండో శనివారం అయితే ఎంత బావుంటుందో, కదా నాన్నా" అని అంది మోహన్ కూతురు. ఆ చిన్నారి ఆశకి నవ్వుకున్నారు అమ్మానాన్నా! ఆదివారం నాడు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వెళ్ళి, తన పనులు చూసుకుని, కావ్య అడిగిన పుస్తకాలు తీసుకున్నాడు మోహన్.

* * *

సోమవారం మామూలుగానే ఎనిమిది గంటలకల్లా వెళ్ళి లైబ్రరీ తెరిచాడు మోహన్. అతడి అసిస్టెంట్ కూడా అప్పటికే వచ్చేసి ఉన్నాడు. పేపర్లు సర్దే పనిని అసిస్టెంట్ చూసుకుంటుండంలో మోహన్ తీరికగా కూర్చుని, తను ఈమధ్యే కొనుక్కున్న గొల్లపూడి మారుతీరావు రాసిన 'సాయంకాలమైంది' అనే నవలని చదువుకుంటున్నాడు. ఇంతలో తన అసిస్టెంట్ ఎవరితోనో గొడవ పడడం విని పించి బయటకు వచ్చాడు మోహన్.

"ఏం జరుగుతోందిక్కడ?" అని అడిగాడు.

"చూడండి సార్, ఈయనకి ఎన్నిసార్లు చెప్పినా, గేట్ రిజిస్టర్‌లో సంతకం చేయకుండా లోపలకి వచ్చేస్తారు. పైగా నీకెందుకు పోరా అని అంటున్నారు" ఫిర్యాదు చేసాడు అసిస్టెంట్.

"చూడండి మాస్టారూ! గేట్ రిజిస్టర్‌లో సంతకం చేయడం తప్పనిసరి. ఎందుకంటే మన శాఖా గ్రంథాలయానికి ఏడాదికి కనీసం 896 మంది చదువరులు వచ్చినట్టుగా రుజువు ఉంటేనే లైబ్రరీని నడిపిస్తారు. ఆ సంఖ్య ఏమాత్రం తగ్గినా లైబ్రరీని మూసేసే అవకాశం వుంది. అలాంటప్పుడు కాలక్షేపం కోసం వచ్చే మీలాంటి వాళ్ళకి పెద్దగా నష్టమేమీ వుండదు. కానీ రిఫరెన్సు మెటీరియల్స్ కోసం వచ్చే విద్యార్థులు, ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు మాత్రం నష్టపోతారు. కాబట్టి సంతకం చేసి లోపలికి రండి" అంటూ వివరంగా చెప్పాడు మోహన్.

ఆయన మౌనంగా సంతకం చేసి లోపలికి వెళ్ళి పేపరు అందుకున్నాడు. కాసేపయ్యాక కావ్య వచ్చింది. మోహన్ ఆమె కోసం తెచ్చిన పుస్తకాలని అందిస్తూ, జాగ్రత్తలు చెప్పాడు. అన్నింటికీ తలూపి, ఆ పుస్తకాలను తీసుకువెళ్ళింది కావ్య. నెలరోజుల తర్వాత ఆ పుస్తకాలను భద్రంగా తిరిగిచ్చేసింది. ఆరు నెలలు గడిచాయి.

రాష్ట్రవ్యాప్తంగా జరిగే గ్రంథాలయ వారోత్సవాల తేదీ ప్రకటించారు. ఈ వారోత్సవాల సమయంలో గదులకు సున్నాలు వేయించడం, రంగు రంగుల కాగితాలు అతికించడం, లైబ్రరీ ఆవరణలో సభ ఏర్పాటు చేయించడం, ఎవరైనా సుప్రసిద్ధ రచయిత/రచయిత్రులను ముఖ్య అతిథిగా పిలవడం, సభను సజావుగా జరిపించడం లాంటి పనులెన్నో లైబ్రేరియన్లు చేయాల్సి వుంటుంది.

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఒక్కో బ్రాంచి లైబ్రరీకి 250 రూపాయల నుంచి 500 రూపాయల మధ్యలో ఇస్తుంది. కానీ ఈ ఏర్పాట్లన్నీ చేయాలంటే కనీసం పదిహేను వందలైనా కావాల్సి వుంటుంది. ఉత్సవాలని ఘనంగా చేయించాలంటే మాత్రం, మిగతా మొత్తాన్ని బ్రాంచి లైబ్రేరియన్లు పెట్టుకోవాల్సిందే. కాకపోతే కొంత మొత్తాన్ని చందాల రూపంలో వసూలు చేసుకోవచ్చు.

మోహన్, సీతారామయ్యగారు, కావ్య కలిసి విరాళాల కోసం తెగ తిరిగారు. మొత్తం మీద ఎనిమిది వందల రూపాయలు పోగయ్యాయి. హెడ్డాఫీసు నుంచి వచ్చిన 500 రూపాయలకి, పోగు చేసిన 800 రూపాయలకి పైన తను ఇంకో రెండు వందల రూపాయలు వేసుకుని మొత్తం పదిహేను వందలతో వారోత్సవాలని బాగానే నిర్వహించాడు. ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయాడు మోహన్.

మర్నాడు పొద్దున్నే లైబ్రరీకి వెళ్ళిపోయాడు. సాయంత్రం ఇల్లు చేరాక, అతడు ఎంతో సంతోషంగా కనిపించాడు. రాత్రి మాటల సందర్భంలో వారోత్సవాల ఖర్చుల ప్రసక్తి వచ్చింది.

"ఎందుకొచ్చిన తిప్పలండీ ఇవన్నీ? ఏదో వృత్తిధర్మంగా మీకెంత ఇస్తే, ఆ డబ్బుతోనే ఏర్పాట్లు చేయవచ్చు కదా?" అని అంది శ్రావణి.

"అసలే గ్రంథాలయాలకి ఆదరణ లేదు. ఇలాంటి ఉత్సవాల పేరుతోనైనా ఏర్పాట్లు బాగా చేస్తే నలుగురు వచ్చి పుస్తకాలు చదువుతారు. సంస్థ బాగుపడుతుంది" అన్నాడు మోహన్.



## అదృష్టం

యాక్షన్, లవ్ స్టోరీలలో పోలిస్తే కామెడీ చిత్రాల్లో నటించడం కొంచెం కష్టమే. ఎందుకంటే మన బాడీ లాంగ్వేజ్‌ని అదుపులో పెట్టుకుని సన్నివేశానికి తగ్గట్టుగా హాస్యాన్ని పండించగలగాలి. ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తోంది ప్రీతీజింగ్యానీ. 'అప్పారావ్ డ్రైవింగ్ స్కూల్'లో నటకిరీటి రాజేంద్రప్రసాద్‌కి జంటగా నటిస్తున్న ప్రీతీజింగ్యానీ 'ఆయనతో కలిసి నటించడం నిజంగా ఓ అదృష్టం' అంటోంది. ముందు ముందు మంచి కామెంట్ టచ్ ఉన్న పాత్రలు చేస్తానని హామీ ఇస్తోంది.

"కానీ మౌనం, నిశ్శబ్దం తప్ప మీకు దక్కింది ఏముంది? మీరు ఎంతగా శ్రమిస్తున్నారో నాకు తెలుసు" అంది శ్రావణి సానుభూతిగా.

"నిజమే, ప్రతీ వృత్తిలోను సాధకబాధకాలు వుంటాయి. కానీ నా ఉద్యోగాన్ని ఏదో చాకిరీలా కాకుండా, ఒక సామాజిక బాధ్యతగా భావిస్తాను. ఆ బాధ్యతను నేను సక్రమంగా నిర్వర్తించగలుగుతున్నాననే ఆనందం నాకు కలుగుతోంది. ఈరోజు సాయంత్రం ఏమైందో తెలుసా? మా లైబ్రరీలో పుస్తకాలు, పేపర్లు చదివి ప్రిపేరైన ఓ పేద అమ్మాయి. డిఎస్సీలో సెలక్టయింది. ఆమెకి రేపోమాపో ప్రభుత్వోద్యోగం వస్తుంది. ఆ అమ్మాయి ఎంతగా కృతజ్ఞతలు చెప్పిందనుకున్నావు! ఈ ఒక్క తార్కాణం చాలు, మా బాధ్యత ఎంత గురుతరమైనదో చెప్పడానికి. భగవద్గీతలోని 'కర్మణ్యే వాధికారస్తే, మా ఫలేషు కదాచన' అనే శ్లోకాన్ని గుర్తుచేసుకో. మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాలి. ఫలితాన్ని భగవంతుడికే వదిలేయాలి. ఇందాక నువ్వన్నావే, 'నిశ్శబ్దం తప్ప నాకు ఏం దక్కిందని?' కానీ ఆ నిశ్శబ్దానికి మరోవైపు ఎనలేని ఆత్మసంతృప్తి వుంది. అది చాలు నాకు." అన్నాడు మోహన్.

మూడేళ్ల తర్వాత, జిల్లాలోనే ఉత్తమ లైబ్రేరియన్‌గా ఎంపికయ్యాడు మోహన్.